# మామ్మ

"నమస్కారం, శర్మగారూ!"

ఎదురనీతుల్ని చదువుతూ చదువులో మునిగిన తల ఎత్తి చూశాను. చిరునవ్వుతో నిలుచున్న అనూరాధ!

"నమస్కారం—రండి, కూర్చోండి" అంటూ ఎదురుగా ఉన్న కుర్చీని చూపించాను.

"క్షమించాలి! మీ చదువుకు అంతరాయం కల్పించినట్టున్నాను."

"అంత పనేమీ లేదు లెండి. ఊసుపోక చదువే గదా!"

అనూరాధ నవ్వింది నాతో పాటుగా.

"మీ కో ఆహ్వానం!" అంటూ చేతి కో శుభలేఖ విస్తూ "దీన్ని, మీరు మన్నించాలి" అని మనవి జేసినట్టే అంది అనూరాధ.

ఆహ్వానపత్రిక మీద వధువు పేరు 'అనూరాధ' అని చదివిన నేను చకితుణ్ణయాను.

"చాలా సంతోషం!"

"నా పెండ్లయితే మీకు సంతోష మేమిటండీ! బాబూ!" గొల్లున నవ్వింది అనూరాధ. అప్రతిభుణ్ణయిన నేను ఆవిడతో శ్రుతి కలిపాను.

"ఓ పెండ్లికూతురు స్వయంగా తన వివాహాని కాహ్వానించడం సంతోషదాయకం కాదా ఏమిటి? అందులోనూ మీ పెండ్లి అంటే విందు. అచ్చంగా పట్టి సామాన్యమైన విందే కాకుండా, వీనులకూ విందాయె."

చల్లగా నవ్విన అనూరాధ "కృతజ్ఞురాల్ని. తప్పక రావాలి సుమండీ!" అంటూ మళ్ళీ ఆహ్వానించింది.

తప్పక వస్తానని మాట ఇచ్చాను. అనూరాధ "సెలవండి" అంటూ సెలవు తీసుకొని వెళ్ళిపోయింది.

ఆ శుభలేఖ నలా వివరంగా చదువుతున్న నాకు 'ఆ పెండ్లి కుమారు డెవరో చాలా యోగ్యుడూ, విజ్ఞాన నిధీ, చాలా ఆదర్శపురుషుడూ అయి ఉండాలి. లేకపోతే అనూరాధను చేసుకుంటానని చొరవగా ముందరకు రావడం, అనూరాధ అంగీకరించడం అంత సులువుగా జరిగే వేమీ కాదు. అనూరాధ అదృష్టవంతురాలై ఉండాలి— కాదు అతడేనేమో!' అనుకుంటూ ఆలోచనలోకి జారిపోయిన నాకు 'వందేత్వాం కమలేక్షణే! వందేత్వాం కమలేక్షణే! వందేత్వాం కమలేక్షణే!' అంటూ ఎక్కడికో, ఏ దిగంతాలకో శ్రోతల్నందర్నీ తనతో పాటే తీసుకొని పోగల అనూరాధ కంఠం మనసులో మెదిలింది.

• • •

అనూరాధ నా సహపాఠి. కాలేజీలో ఇద్దరం బి. ఎస్‌సి. విద్యార్థులం. అందరికన్నా ఆలస్యంగా కాలేజీలో చేరిన వాణ్ణి నేను. నేను చేరిన మర్నాడే కాలేజీలో ఏదో సమావేశం జరిగింది. అధ్యక్షులు ప్రార్థన అన్నారు. వెంటనే స్టేజి మీదికి ఓ అమ్మాయి వచ్చింది. వెనకనుంచి 'మామ్మ' అని ఓ వంద గొంతులు కూశాయి. గోలలో కలిసి పోయాయి.

"అంబ ప్రసీద కరుణా పరిపూర్ణ దృష్ట్యా
మాం త్వత్కృపా ద్రవిణగేహ మిమం కురుష్వ
ఆలోకయ ప్రణత హృద్గతశోక హంత్రి
త్వత్పాద పద్మ యుగళం ప్రణమామ్యహం శ్రీం."

మంద్రస్థాయి మధ్యమాన్నందుకుంది. అప్పటినుంచి తారాపథాన—

"విష్ణుస్తుతి పరాం లక్ష్మీం స్వర్ణ వర్ణ స్తుతి ప్రియాం
వరదాభయదాం దేవీం వందే త్వాం కమలేక్షణే
వందేత్వాం కమలేక్షణే! వందేత్వాం కమలేక్షణే!"

అంటూ ధ్రువతారనే దాటి ఎక్కడికో, ఏ దిగంతాలకో తనతోపాటు శ్రోతల్నందర్నీ తీసుకొనిపోయింది.

వంద గొంతుకల్నీ వందలాది కరతాళ ధ్వనులు వెక్కిరించాయి.

మధురానుభూతిలో మున్కలు వేస్తున్న నేను ఆ గానమాధురిని వర్షింపజేసిన ఆ అనూరాధను— గానసరస్వతిని ప్రశంసించి నా మధురానుభూతిని వ్యక్తం చేయకుండా ఉండలేక పోయాను.

• • •

కాలేగేటుపైన మర్నాడు కాలేజీకి వెళ్ళగానే తాటికాయలంత అక్షరాలు— "శర్మ మామ్మలకు అభినందనలు"— అంటూ ప్రత్యక్షమయాయి. 'మామ్మ' అన్న మాట నిన్న వినపడ్డ మాట. కాని, ఈ మామ్మ ఎవరో, శర్మ ఎవరో పోల్చుకోలేకపోయాను. సరాసరి క్లాసు రూముకు పోయాను. "కంగ్రాచ్యులేషన్స్!" అంటూ పరామర్శించాడు రామేశం. "ఏమిటి సంగతి" అన్న నాకు అంతా గొల్లుమని నవ్విన నవ్వే సమాధానమైంది.

ఎదురుగా బోర్డుమీద 'శర్మ మామ్మలకు అభినందనలు' అని చక్కగా సుద్దముక్కలతో రంగులతో చెక్కి ఉంది. కింద ఓ యువతీ, ఓ యువకుడూ పూలదండల్ని మార్చుకుంటున్నట్లు చక్కగా చిత్రించి ఉంది. అమ్మాయి బొమ్మ క్రింద మామ్మ అనీ, అబ్బాయి బొమ్మ కింద శర్మ అనీ వివరంగా వ్రాసి ఉంది. బహుశా ఈ శర్మను నేనా? అనుకున్న నాకు ముచ్చెమటలు పోశాయి, మామ్మ అనూరాధా? అనిపించి.

ఇంతలో అనూరాధ రావడం కనిపించింది. అంతా వరుసా క్రమమూ తప్పకుండా చప్పట్లు కొట్టసాగారు. అనూరాధ క్లాసురూములో కొచ్చింది. చప్పట్లాగిపోయాయి. తోటి విద్యార్థినులంతా ఆదివరదాకా యథాశక్తి నవ్వీ నవ్వకుండా అందరితోపాటు నవ్వినవారే. అప్పటి కేదో బుద్ధిగా కూర్చొని బోర్డు వైపు సైగ జేసి చూపారు అనూరాధకు. అనూరాధ హాయిగా నవ్వింది. "ఈ కళాకారుడు చాలా పైకి వస్తాడు— భగవంతు డిచ్చిన కళను సార్థకం చేసుకోవడానికి ప్రయత్నిస్తే!" అంది, తాపీగా ముఖ కవళికల్లో నిశ్చలమూ, నిర్మలమూ అయిన భావం తప్ప మరో భావం ఏదీ చూద్దామన్నా కనిపించని ముద్రతో. ఇంతలో రామబ్రహ్మంగారు— తెలుగు ప్రొఫెసరు — వచ్చారు, ఆ బోర్డును తిలకించారు. "జంటిల్‌మెన్! ఏమి టీ దౌర్భాగ్యం! మన నాగరకత ఇదా? ఓ ఆడపిల్లను, మీ సహాధ్యాయినిని ఇలా కించపరచడం భావ్యమేనా? మీ

'చైతన్య'

సహాధ్యాయినిని సోదరిలా చూసి ఆవిడ చదువుకునేందుకు దోహదం చేయగల్గింతటి సంస్కారం మీలో లేదా?" అంటూ ఉపన్యాసం ప్రారంభించారు.

"ఈ పని చేసిన దెవరో లేచి క్షమాపణ చెప్పుకోకపోతే నే నిక క్లాసుకు రాను. లేవండి. ఎవరో లేవండి. తప్పు చేయడం మానవ సహజం. చేసిన తప్పును ఒప్పుకోవడం, పశ్చాత్తాపం చెందడం మానవతకు ఆదర్శమైన చిహ్నం" అని నిగ్గదీసి నిలబడమన్నారు.

అనూరాధ లేచి నిలుచుంది. "నీవు కూర్చోమ్మా! నీవు కూర్చో!" అంటూ రామబ్రహ్మంగారు అనునయించారు. అనూరాధ కూర్చోలేదు. "క్షమించండి, మాస్టారూ! వీళ్ళంతా నాకు సోదరతుల్యులు. నన్ను 'మామ్మ' అని పిలిచి గౌరవిస్తారు. 'మా అమ్మ' అని ఇందరి చేత అనిపించుకునే భాగ్యం నాది. మామ్మ అంటే ఫలానా అనూరాధ అని వాళ్ళకు అర్థమైతే, వాళ్ళు న న్నా సాంకేతిక నామంతోనే పోల్చుకోనివ్వండి. అది నా కేలాంటి వ్యథనూ జుగుప్సనూ కలిగించదు. నేను నిజం చెప్తున్నాను, మాస్టారూ! ఇంటిలో అన్నలూ, తమ్ముళ్ళూ సోదరిని పెండ్లికూతురుగా చూస్తూ ఉడికించడం సర్వ సామాన్యమైన విషయమే కదండీ! అన్నతమ్ముళ్ళకూ, అక్కచెల్లెళ్ళకూ నోచుకోని ఒకటరిదాన్ని. ఈ మన కుటుంబంలో మీరు తండ్రిగా, మేమంతా బిడ్డలుగా పోల్చుకుంటే నన్నెవ్వరూ ఇక్కడ అగౌరవపరిచారనే ప్రశ్న లేదు— రాదు. ఇంతకు మించి దీన్ని గురించి ఆలోచించవలసిన పని లేదు. క్షమించండి!" అంటూ చేతులు జోడించింది.

ఇదేదో సినిమా వ్యవహారంలా తోచి మూఢుణ్ణయిపోతున్న నేను రామబ్రహ్మంగారి కండ్ల వెంట స్రవించిన అశ్రువుల్ని చూసి నిర్ఘాంతపోయాను. క్లాసంతా స్తబ్ధమై పోయింది. "క్లాస్ డిస్మిస్‌డ్" అంటూ "భగవంతుడు మీకు జ్ఞానాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. అంతా నిశ్శబ్దంగా వెళ్ళండి" అన్నారు. పిల్లల్లా అంతా వరుసనే అతి క్రమశిక్షణాపరుల్లా వెళ్ళారు. నే



నొక్కణ్ణే నిర్ఘాంతపోయి కూర్చున్నవాణ్ణి. ఆడపిల్లలంతా లేచారు. అనూరాధ నా దగ్గరగా వచ్చి "మీ రేమీ అనుకోకండి. నిన్న మీరు నన్ను పలకరించి ప్రశంసించడం దీనికి మూలం. కాలేజీ అంటే ఇంతమాత్రమైనా అసభ్యతా గోలా లేకుంటే అది కాలేజీనే కాదు!" అని నవ్వి మరీ వెళ్ళింది.

మా క్లాసులో ఆడపిల్లలందరికీ మారుపేర్లున్నాయి. శాంతను 'కామి', అని, గాయత్రిని 'గాడెస్' అని ఇంకా ఇలాగే ఎన్నో. వాటిలో అనూరాధ పేరు 'మామ్మ'.

* * *

మరునాడు పొద్దున్న అనూరాధ బజారులో కనిపించింది. 'నమస్కారమండీ' అంటూ ఎలాంటి ఎచ్చెరకమూ లేకుండా పలకరించింది. వీణ తీగెలకని ఇలా వచ్చానని చెప్పింది. ఎంతో చిరపరిచితలా మాట్లాడింది. అలా కబుర్లు చెప్పుకుంటూనే కాలేజీకి చేరాము.

దాదాపు ప్రతి రోజూ అనూరాధా, నేనూ కలిసే కాలేజీకి వెళ్ళేవాళ్ళం. ఇండ్లకు సమీపాన ఉండేవాళ్ళం—మా ఇళ్ళు రెండూ దగ్గరే కనక. క్రమక్రమంగా మా పరిచయం పరిణతి చెంది ఒకరి పట్ల ఒకరికి చనువూ, అభిమానమూ ఏర్పడ్డాయి. ఓ రోజు కుటుంబాలూ, అక్కలూ, చెల్లెళ్ళూ ప్రస్తావన వచ్చి అనూరాధ 'నేను తండ్రినే తెలియని దౌర్భాగ్యురాల్ని. నా కంతా అమ్మ ఒక్కతే! ఆవిడకు నే నొక్కదాన్ని. అమ్మ చదువుకొని ఉద్యోగం చేస్తూ నన్ను పోషిస్తున్నది' అని క్లుప్తంగా తన కథను చెప్పింది. నాకు చాలా జాలి వేసింది. అనూరాధ పట్ల నా అభిమానం గాఢమైంది.

చిన్నతనంలో అనూరాధకు స్ఫోటకం పోసిందట. ముఖాన మచ్చ లేర్పడ్డాయి. అట్టే దృఢంగా, సౌష్ఠవంగా ఉన్న శరీరం కాదు. భగవంతు డావిడకు ప్రసాదించిన రూప మది!

మానవ సమాజంలోనే "కరుణ" కనికరింపబడడానికి నోచుకోని కాలం కావటాన అనూరాధపట్ల సమాజంలో కరుణకు స్థానమే లేకపోయింది.

'మామ్మతో ఫోటో తీయించుకుంటావ్రా! నీకు వంద రూపాయ లిస్తాము' అంటే 'గాడ్' అని బెదిరిపోవడాన్నిభినయించడం కాలేజీ విద్యార్థులకు సరదా. తను కారణం కాని తన రూపానికి అనూరాధ మామ్మ అయిపోయింది.

అమలాపురంలో చదువుకున్నంత కాలం సెలవులకని నేను రాజమండ్రి మీదుగా బొబ్బర్లంకకు వచ్చేవాణ్ణి, ఇంకా కోనసీమ లంకకు గోదావరి మీదుగా రహదా రేర్పడ్డ రోజులు కావవి గాబట్టి. అనూరాధ అమ్మ దగ్గరకు— రాజమండ్రి — వచ్చేది. నేను వచ్చేప్పుడూ, పోయేప్పుడూ వాళ్ళింటికి వెళ్ళేవాణ్ణి. అనూరాధ అమ్మగారు ఎంతో ఆదరించేవారు. అక్కడే ఉండిపొమ్మని బలవంత పెట్టేవారు. కాదనలేకపోయేవాణ్ణి. అలా నేనూ వారి కుటుంబశ్రేణిలో ఒకణ్ణిలా అయిపోయాను.

అనుకోకుండా అనూరాధ తన వివాహ ఆహ్వానపత్రిక ఇస్తే ఆశ్చర్యపడ్డాను

అసూయా పడ్డాను. ఎందుకో నిర్లిప్తంగా బాధా పడ్డాను.

ఆ సాయంత్రం అనూరాధ తిరిగొచ్చింది. వరుణ్ణి గురించి నేనే ప్రస్తావించాను. "ఆయన ఎమ్. ఎస్‌సి. చదివారు. ఏదైనా రిసెర్చి స్వయంగా చేయాలని అభిలాషట. తన భార్య బి. ఎస్‌సి. దాకానైనా చదివి తనకు సహాయభూతురాలుగా ఉండగలగాలని ఉద్దేశ్యమట. అమ్మతో పరిచయమైంది. ఆవిడ అన్నీ మాట్లాడి నాకు పెర్మిషన్ ఇచ్చింది. నేను వెళ్లాను. ఆయనెక్కడో అంతా ఊహాప్రపంచంలో విహరిస్తున్నారేమో అనిపిస్తుంది. అందం ఏమిటి? మానవుడికీ మానవుడికీ మధ్య ఉండవలసిం దేమిటి? అదేమిటి? ఇదేమిటి? అని అన్నీ ప్రశ్నలే మాట్లాడారు, 'అమ్మాయి నచ్చినట్లేనా' అని అమ్మ అడిగితే, గిరీశం పోజులో. అమ్మకు పాపం, తను రిజెక్టైతే నాకు పెండ్లి చేయలేనన్న భయంలా ఉంది. అవి జ్ఞెందుకు బాధ పెట్టాలి? అంతా శుభం అన్నారు. శుభలేఖలు కొట్టించి ఇచ్చారు. అంతే!" అని కథంతా చెప్పింది.

"ఇంతకూ మీకు నచ్చినట్లేనా?"

"వాట్! మామ్మకు నచ్చటమేమిటి? నచ్చకపోవడమేమిటి?" అంటూ గలగలా నవ్వింది అనూరాధ.

"అదేమిటి, అనూరాధా?"


"అవును, మహాశయా! అందరికీ కోరుకునే హక్కూ, ఆశించే హక్కూ ఉండదండీ! అది లౌకిక సత్యం. రేపు కలుసుకుందామండీ. సెలవు!" అంటూ అకస్మాత్తుగా వెళ్లిపోయింది అనూరాధ.

నన్నేదో బాధ—అర్థంకాని బాధ— ఆవరించింది.

* * *

అనూరాధ పెండ్లికి వెళుతూ మళ్లీ హెచ్చరించి మరీ వెళ్లింది 'తప్పక వస్తారు కదూ!' అని. 'తప్పక' అని మాట ఇచ్చాను. కాని, అత్యవసరంగా బాపట్ల వెళ్లవలసి వచ్చి వెళ్లాను. ఎలాగైనా వెళతాను గదా అని కనీసం అభినందనల్ని పెర్మిగావ్ తోనో, కనీసం జాబుతోనో రాలేకపోయిన నా అశక్తతనైనా వెల్లడించలేకపోయాను. బాపట్ల నుండి తిరిగి వచ్చేటప్పుడు భీమవరం మీదుగా రావలసివచ్చి, రాజమండ్రిలో అనూరాధను కలుసుకోలేకపోయాను.

కాలేజీ తెరిచిన రోజున నా కండ్లన్నీ అనూరాధ కోసం అంతటా తామేగా వెతికాయి. కాని, అనూరాధ కనిపించ లేదు. సాయంత్రం గదిలో కూర్చుని




అనూరాధను గురించే ఆలోచిస్తున్న నాకు సుడిగాలి వంటి సుబ్బారావు రాక మందస్మితాన్నే ఇచ్చింది. సుడిగాలిగాడు ఊరికే రాడు. ఏదో వార్త విసిరే వెళతాడు. ఉబుసుపోకకు మంచి కాలక్షేపం సుబ్బారావు.

వస్తూనే "హల్లో, శర్మా!" అంటూ సుడి వేశాడు. "హల్లో, ఏమిటి విశేషం?" అంటూ ఆహ్వానించాను.

"అనూరాధ పెండ్లి! ఆదేనోయ్- మన మామ్మ పెండ్లి — ఎలా జరిగింది?" అని ఎదురు ప్రశ్న వేశాడు. అనూరాధను మామ్మ అన్నందుకు ముఖం పగల గొట్టాలన్నంత కోపం వచ్చింది. కాని, ఏదో వార్తావాహినితోనే వచ్చి ఉంటాడని దాన్ని వినాలన్న ఆకాంక్ష కొద్దీ తమాయించుకొన్నాను. "నేను వెళ్లలేక పోయాను, రావ్! నీవు రాజమండ్రి వాడవే కదా—వెళ్లి రాలేదా?" అన్నాను.

"నిజంగానే నీవు రాకపోవడమేమిటి, బ్రదర్? అదే ఆశ్చర్యపోయాను. మామ్మ నిన్ను గురించే అడిగింది. పాపం, నీవే వచ్చిఉంటే మామ్మ కెంతో సహాయం చేయగలిగి ఉండేవాడివి" అన్న సుబ్బారావు మాటల్లోని వ్యంగ్యం ఏదో కీడునే శంకింప జేసింది. నన్ను నేను సంబాళించుకొని—

"ఏదో చుట్టం చూపుగా వెళ్లే వాళ్లం మనం చేయగలిగిన సహాయమేముంటుంది, సుబ్బారావ్? కాకపోతే వాళ్లు సమకూర్చిన పదార్థాలను స్వాహా చేయడం మినహా?" అన్నాను.

"కాదయ్యా, బాబూ! నీవు నిజంగానే సహాయపడగలిగేవాడివి. నీవే అక్కడ ఉండి ఉంటే ఈపాటికి మామ్మ పెండ్లి జరిగేపోయి ఉండేది!"

"మిస్టర్ సుబ్బారావ్! పరాచికానికీ ఓ హద్దంటూ ఉండాలి. అనూరాధ పెండ్లి కాలేదా?"

"క్షమించు, బ్రదర్! మామ్మను చేసుకుంటానన్న ఆ మేధావి గుట్టు చప్పుడు కాకుండా ముహూర్తం మూడే మూడు గంట లుండగా ఓ హైకమిషన్‌ను పంపాట్ట. ఆ హైకమిషన్ మామ్మ అమ్మగారితో సంప్రదించిందిట. ఆమె విస్తుపోయి మామ్మను పిలిచి మాట్లాడిందిట. మామ్మ ససేమిరా ఆ దౌర్భాగ్యాన్ని చేసుకోనందిట. వాళ్లమ్మ ఎంత ప్రాధేయపడ్డా ప్రయోజనం లేకపోయిందిట. ఏతా వాతా మామ్మ శ్రీమతి మామ్మ కాలేదు. వచ్చిన బంధువులంతా ఎవరి దారిన వారు ఎదురైన హోటల్లో ఎంగిలిపడి వెళ్లిపోయారు— కథ కంచికి మన మింటికి అన్నట్లు."

"సుబ్బారావ్! కొంచెం వివరంగా చెప్పు. హైకమిషనేమిటి? ఈ లొల్లాడవేమిటి?"

"మనకేం తెలుస్తుంది బ్రదర్! నేనేదో వీలు చూసుకొని మామ్మను కలుసుకున్నాను."

"ఏమంది?"

"అరె! మనిషం టేమామ్మరా, బ్రదర్!" వాళ్లమ్మ ముఖం చూపలేక ఎక్కడో చోటు చేసుకుంటే, మామ్మ రవ్వంతైనా బాధ పడ్డట్టు లేదు. అంతా తానేగా తిరిగింది. అందర్నీ పరామర్శించింది. 'హల్లో! సుబ్బారావుగారూ! మీ రొకరే వచ్చారు. రండి. టిఫిన్ తీసుకొందురు గాని' అని కేక వేసి టిఫిన్ పెట్టింది. నేనే ఏదో ఆముదం తాగిన ముఖం పెట్టాను. ఎలా పసి గట్టిందో ఏమో!"

'మిస్టర్ సుబ్బారావ్! అంతా నా పట్ల అదేదో సానుభూతిగా చూస్తుంటే చచ్చిపోతున్నాను. కనీసం మీరన్నా కంగ్రాచ్యులేషన్ అని నన్ను అభినందిస్తే సంతోషిస్తాను' అంది.

'అదేమిటి, అనూరాధా!' అన్నాను. మళ్లీ ఇదొకటా!

'మీ రెప్పుడూ నన్ను పోల్చుకునే మామ్మ అంటేనే బాగుంటుంది అంది. నిజంగా నేను ఒక్క ముఖం వేశాను. అయినా, నన్ను నేను కూడదీసుకొని 'ఎందుకని మిమ్మల్ని అభినందించాలండీ' అన్నాను. 'అదేమిటండీ! ఈ రోజు అధోగతిలో పడవలసిన నా జీవితం యథాస్థానంలో ఉన్నందుకు' అంది. 'అస లేం జరిగింది?' అన్నాను. 'అసలేమీ జరగనే లేదు గనకనే నండీ!' అంటూ నవ్వింది. ఇక మాట్లాడటానికి వీలు లేక 'శర్మ వచ్చినట్లు లేదండీ' అన్నాను. 'రానట్లుందండీ' అని మళ్లీ నవ్వింది. నేను చిత్తం సెలవు తీసుకున్నాను" అంటూ సుడిగాల్లు వీచాడు నావో.

"ఆటూఇటూ ఉబుసుపోక గాస్పేమన్నా ఊసులాడలేదా, సుబ్బారావ్?"

"బాకాల్లా ఊదారు."

"ఏమని?"

"ఆ ఏముందని? అంతా నీ పేరే విని వినపడనట్లనుకున్నారు. ఆ నీవు వచ్చి ఉంటే నిన్ను స్తంభానికి కట్టేసి నీ చేత మామ్మ మెడలో తాళి కట్టించే వారమని జబ్బలు చరిచారు. అదృష్టవంతుడివి. వస్తా" నంటూ నన్ను నేను గుర్తించేలోగా సుడిగాలిలా వెళ్లిపోయాడు. నిర్ఘాంతపోయిన నేను ఆ అఘాతం నుంచి కోలుకొని ఆలోచిస్తే 'అదృష్టవంతుడివి' అన్న సుబ్బారావు మాట

(తరువాయి 58 వ పేజీలో)

(39వ పేజీ తరువాయి)

'దురదృష్టవంతుడివి' అంటే ఎంతో బాగుండేదనిపించింది. ఆ సంగీత సరస్వతిని — అనూరాధను— అర్ధాంగిగా చేసుకునేంతటి అదృష్టమే నాకు కలిగి ఉంటే ఎంతటి భాగ్యానికి నోచుకున్న వాణ్ణయే వాణ్ణో! ఊహించుకోలేకపోయాను. తన వివాహాహ్వానప్రతికను అనూరాధ ఇచ్చిననాడు నే నెంత మర్మవేదన పడ్డానో నాకు తెలుసు. నా పేరుతో అనూరాధకు జరిగిన ఈ అన్యాయాన్ని నే నెందుకు సరిదిద్దరాదనిపించింది. నన్ను సాకి సంరక్షిస్తున్న అన్నయ్య నన్ను కాదనరు. అమ్మనూ, బామ్మనూ ఆయనే ఒప్పించుకుంటారు — అనుకుంటూ ఓ నిర్ణయాని కొచ్చాను. తొలి కోడితో లేచి తొలి బస్సునే ఎక్కి సరాసరి రాజమండ్రి చేరుకున్నాను.

తీరా రాజమండ్రి చేరాక అనూరాధ ఇంటికి వెళ్ళడానికి అడుగులు తడబడ్డాయి. అనూరాధ అమ్మ వేణమ్మగారు నన్ను గురించి ఎలాంటి అభిప్రాయ పడ్డారో తెలియదు. దురదృష్టవశాన నన్నావిడ దుష్టుడుగా చిత్రించుకొని ఉంటే నే నెదుర్కొనే పరిస్థితి అసహ్యకరంగా ఉండక మానదు. నా ప్రవేశం వాళ్ళకు బాధాకరంగా పరిణమిస్తుందేమో! ఎలాగని తడబడ్డాను. అయినా నేను ఓ సదుద్దేశ్యంతోటి ఓ నిర్ణయంతోటి వచ్చాను కదా అని సమాధానపడి ఏ పరిస్థితినైనా సరే ఎదుర్కొందామన్న నిశ్చయంతో వేణమ్మగారింటికి త్రోవ తీశాను. ఇల్లు సమీపించిన కొద్దీ అడుగులు అరడుగు లయాయి. బెరుకు బెరుకుగానే ఆ ఇంటిని చేరాను. ఎదురుగా ఇల్లు బావురుమంటూంది. పక్క వాటాలోని వారి ఇరవై రెండేళ్ళ కన్యారత్నం ఇంతేసి కండ్లతో నన్ను చూసింది. చెరువులో కప్పపిల్ల బుడుంగుమని దూకి మాయమైనట్లు మాయమైంది ఇంట్లోకి దూరి. ఆవిడ మామ్మగారూ, బామ్మగారూ, అమ్మా, మేనత్తా, ఇరవై ఏండ్ల చెల్లెలు చిట్టీ, రెప్పల్లాపి మూతులకు చేతుల్ని చేర్చి ఉన్నవాళ్ళు, నెత్తి మీది గుడ్డల్నీ, లేనివాళ్ళు పమిటల్నీ ముందుకో వెనక్కో లాగి వచ్చి ఒళ్ళంతా కండ్లు చేసుకొని చూశారు. "ఎవరి కోసం, నాయనా?" అంటూ అడిగింది, వయసుడిగి వగ్గే అయినా భగ్గున పది కొంపల్ని ముట్టించడానికి వాడి సడలని ముసలావిడ. అక్కా చెల్లెళ్ళ మధ్య "ఆయనేనే! — ఆ!" అన్న గుసగుసల్లాంటివి నాకు స్పష్టంగా వినిపించాయి. "వేణమ్మగారి కోసమండీ!" అన్నాను. "ఇంకెక్కడి వేణమ్మగారు, నాయనా! ఆ పెండ్లాగి పోయిన మూడో నాడే మూడవ కంటికి తెలీకుండా వెళ్ళిపోయారు" అంటూ నోటిని శుద్ధిగా ఉంచే నోసట వెక్కిరించింది, ఆ పూర్వ సువాసిని. "ఎక్కడకు వెళ్లారో తెలీదాండీ?" అడిగాను. "ఎలా తెలుస్తుంది నాయనా?" అంటూ తేల్చివేసింది సానుభూతిని ఒలకబోస్తూ.

"వా రెక్కణ్ణుంచి వచ్చారో" అంది కన్యకామణి, వాళ్ల వాళ్ల నడిగినట్లు నాకు వినపడేలా.

"అమలాపురం నుంచండీ!"


"అయితే, అనూరాధ నడిగితే తెలుస్తుంది గదా!" అంది అదే బాణీలో.

"ఆవిడా స్కూలుకు రావేదండీ!"

"ఎవరో శర్మ అని ఉన్నారట ఆవిడ క్లాసులో ఆయనకు తెలియొచ్చండీ!" అంది సంగనాచిలా. చిట్టి చెల్లాయి 'ఔను!' అని వత్తాసి పలికింది. 'నేనే ఆ శర్మను' అని చెప్పడానికి నాకు అభిమానం అడ్డు పడ్డది. వాళ్ళు స్పష్టంగా జేసిన అపహాస్యం నాకు స్ఫురిస్తూనే ఉంది. ఉస్సూరుమని తిరోముఖుణ్ణయాను.

'సంగనాచి తొత్తు కొడుకు వాడే ఆ శర్మ' అంది చిట్టి చెల్లాయి అక్క — అంతకు ముందు వేణమ్మ గారింటికి నేను వెళ్ళినప్పుడల్లా ముస్తాబై ఏదో వంకతో నా కంటబడాలని నానా ప్రయాస పడుతూ ఆయాసపడ్డ ఈ లీలావతి!

అమలాపురం తిరిగి వచ్చి విచారిస్తే కాలేజీ తెరవబడక ముందే పోస్టులో ట్రాన్స్ఫరు సర్టిఫికేటు రాజమండ్రి చిరునామాకే పంపబడ్డట్లు తెలిసింది. హతాశుణ్ణయాను. అనూరాధ జాడ తెలియనేలేదు.



బుసబుస ..

ఫోటో—జి. ఇస్మాయిల్ (నత్తెవపల్లి

* * *


కాలగమనంలో పదేండ్లు గడిచి పోయాయి. అనంతమైన కాల ప్రమాణంలో పదేండ్లు లెక్కకురాని అతి చిన్న కాలం మాత్రమే. కాని, వ్యక్తి జీవితంలో గణింపదగ్గది దశాబ్దం! నూరేండ్ల ఆయుః ప్రమాణం మానవునిది. ఎక్కడో కదాచితుగా లెక్క కొకటిగా చూపడానికి మాత్రమే అంతటి ఆయువునూ అంతు చూడగల వ్యక్తులు ఎందరో వేయి పున్నమలను చూడకుండానే కన్ను మూస్తారు. డెబ్బై ఏండ్లు బ్రతికిన వ్యక్తి డెబ్బై ఏండ్లని వత్తి వత్తి చెప్పుకుంటాడు మహా ఘనంగా! కాని, డెబ్బై ఏండ్లంటే 840 నెలలు మాత్రమే! ఈ కాలంలో అతడి వేడి పొంగూ చల్లారి, విచక్షణా జ్ఞానం కొంచెం వచ్చే వేళకు వేళ బాగా—సగానికి పైగా—జారిపోయిందని గ్రహింపలేని స్థితిలోనే నిద్రిస్తుంటాడు. తన జీవిత కాలంలో సాయంత్రం ఆరంభించిందన్న విషయ గ్రహణ శక్తి ఏదో తెలియని మత్తులో జాగృతం కాలేదు — కాదు. తాపత్రయపు తాపంలోనే ఆత్రతతో, ఆవేశంతో దాన్నీ దీన్నీ సాధించాలని నిర్విరామంగా గమ్యమంటూ లేని పాంథుడిలా ప్రవర్తిస్తుంటాడు. జీవిత కాలం ఏ క్షణాన ముగింపు కొస్తుందోనన్న ఆలోచనే రాదు. ఇదే జీవితం కాబోలు!

దేని కీ శ్రమ? దేన్ని సాధించడానికి? ప్రహ్లాదుడు పుట్టని, చావని త్రోవ వెదకికొనుట దొడ్డబుద్ధి అని తండ్రికే బోధ చేసిన దొడ్డబుద్ధి. బలిచక్రవర్తి దానంగా తననే అర్పణ చేసి, అంతిమ ఘడియల్లో ఎందరు రాజు లొచ్చిపోయారు? ఏమైనా వెంట కట్టుకు వెళ్లారా? వదాన్యులైన దధీచీ, శిబీ వంటి వారిని ప్రజలు మరిచారా? అని కనీసం పేరూ ప్రతిష్ఠ కావాలని వాంఛించి సాధించాడు. కాని, ఆత్మను పరమాత్మలో ఐక్యం చేయాలని, చావు పుట్టుకలకు స్వస్తి చెప్పి సద్గతికోసం శ్రమించే వ్యాసంగం కలి పుట్టుకతోనే అంతమైనట్లుంది!***

శర్మ త్యాగరాయ సభల ప్రాంగణానికి తాపత్రయాలనూ ఈషణత్రయాలనూ గురించి ఆలోచిస్తూ చేరాడు. గాయని

# పెరుగుతున్న విలువ

కథ — వి. ప్రభావతి (జూనియర్)



"ఉండేది రాము డొకడు ఊరక చెడిపోకె మనసా!" అని ఆ మనస్సును అనునయించి, బుజ్జగించి, బెదిరించి బుద్ధి చెపుతూంది.

"తామసాది గుణ రహితుడు
ధర్మాత్ముడు సర్వసముడు
చిత్త హితుడు త్యాగరాయనుతుడు
ఉండేది రాముడొకడు ఊరక చెడి
పోకె మనసా!"

గాయని మధుర గాత్రం త్యాగయ్య హృదయ తంత్రులను పలికించినట్లుంది. శర్మ హృదయతంత్రులు ఊగిపోయాయి. మానవుడే గుణాతీతుడైతే, స్వయం విష్ణుడే కాడా?

త్యాగయ్య కృతులను విని హాయిలో తేలిపోతూ ఇంటికి వస్తున్న శర్మకు ఇల్లింకా అంత దూరాన ఉండగానే చెవులకు హాయిగా "నిధి చాల సుఖమా! రాముని సన్నిధి సేవ సుఖమా నిజముగ పల్కు మనసా!" అన్న త్యాగరాజ కీర్తన వాయులీనం పైన మృదుమధురంగా వినిపించింది. ప్రతి రోజూ అన్నయ్య కూతురు శారద ఆ ఫిడేలు ప్రాణాన్ని తీస్తుంటే వచ్చే శబ్ద తరంగాల బీభత్సానికి బదులు చేయితిరిగిన చేయి మలచే మృదుమధుర సంగీత స్రవంతి ఈ రోజు ప్రత్యేకతనే సూచించింది. ఆ వాయిస్తున్న వా రెవరో తనను చూసి ఆపివేసి పోతారేమోనన్న సంకోచంతో అక్కడే ఆగి, ఆ పాట పూర్తాయి అవతలివారు వదిన గారి దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిందాకా బజారులోనే విలబడి ఇంటికి పోయాడు.

"ఎవ రొదినా ఆ వాయులీనం వాయించిన వారు?" అని వదినను అడిగాడు.

"ప్రక్క ఇంట్లో చేరారోయ్ ఈ మధ్యనే. ఆ అమ్మాయి ఏదో ఆఫీసులో పనిచేస్తోంది. తల్లీ, కూతురూ ఇద్దరే ఇద్దరు. మహా మర్యాదమ్మలూ, సంస్కారం పుష్కలంగా గల వారూను" అని చెప్పింది వదిన.

• • •

"రండి! రండి! మిమ్మల్ని ఏమండీ అనటమే గాని, మీ పేరేమిటో తెలుసుకోనే లేదు!" నవ్వుతూ ఆహ్వానించింది సత్యవతి.

"పేరు కేమిటి లెండి. వేణమ్మ అంటారు" అంటూ వేణమ్మ గారు వచ్చి సత్యవతమ్మ గారి సరసన కూర్చున్నారు.

"నేనే మీ ఇంటికి వద్దా మనుకుంటూ నండీ! ఎప్పుడూ నాకు ఈ పనితోనే సరిపోతుంది. ఈ పిల్లలందరికీ స్కూళ్ళు ఒకే వేళల్లో లేవు. వచ్చేవాళ్ళకూ పోయేవాళ్ళకూ అన్నాలు పెట్టడానికి, కంచాలు కడగడానికి సరిపోతుంటుంది పుణ్యకాలమంతా."

గుంపెడు పిల్లల తల్లి సత్యవతమ్మ తన క్షోభ వెళ్ళబోసుకుంది.

"అలాగేనమ్మా! నలుగురు గల తల్లివి గదా! అదృష్టవంతురాలవు!"

"ఆc! ఏ మదృష్టమో లెండి! ఒక్క క్షణం తీరికైనా లేక సతమతమై పోతుంటేను!"

"అదృష్టం విలువ ఉన్న వాళ్ళకు తెలియదమ్మా! ఇలా సతమతమై పోతున్నానని మీ రనుకుంటుంటారా, నేను ఆ పిల్ల ఆఫీసుకు వెళ్ళితే బిక్కుబిక్కుమంటూ ఊసుపోక ఈ ఏకాకి జీవిత మేమిటా అని కుమిలిపోతుంటాను. ఎటొచ్చీ నాకు కొంచెం కాలక్షేపం మీ నాలుగోవాడు. వాడు—'అమ్మమ్మగారూ! మీరూ నేనూ ఒక పార్టీ అండీ —అవూ మాడా పార్టీ. మీరు ఆవూ, నేను దూడా' అని మొన్న అంటే, ఆ మాట జ్ఞాపకాని కొచ్చినప్పుడల్లా విరగబడిపోతుంటాను. నిన్న మధ్యాహ్నం వాణ్ణి కేకవేసి 'కాఫీ తీసుకోరా' అని ఇచ్చాను. 'ఎందుకండీ?' అన్నాడు. 'నేను ఆవూ, నీవు దూడా కాదు టూ' అన్నాను. 'అలా అయితే మీరు పాలివ్వాలి గాని, కాఫీ ఇస్తా రేమిటండీ' అని గలగల్లాడాడు" అని వేణమ్మగారు గలగలాడారు.

సత్యవతి హృదయం స్పందించింది.

"వాడు కొంటె వెధవండీ! అంతా అంటుదేండ్లన్నా నిండకుండా వాడు మొన్న వాళ్ళ నాన్న గారితో—'ఆ క్లాసులో టీచరు నల్లగా, మొద్దుగా, అసహ్యంగా ఉందండి. నన్ను మరో క్లాసులో వేయించ' మని అడుగుతున్నాడు. వాళ్ళ నాన్న 'అవి డెలా ఉంటే నీ కేమిరా? నీకు చదువు చెపితే చాలుకదా?' అన్నారు. మరి 'అమ్మ నీకు కాఫీ ఇస్తే గ్లాసు మడ్డిగా ఉందని ఛీ ఛీ అని అన్నారే. ఆ కాఫీనే మరో గ్లాసులో పోసి ఇస్తే తాగారేం? పొద్దున?' అన్నాడు.

వాళ్ళ నాన్న వా డవతలికి పోయాక 'వీడి వాలకం జూస్తుంటే నాకు 'కృష్ణ కర్ణామృతం'లో శ్లోకాలు జ్ఞాపకానికి వస్తున్నాయే' అని మురిసిపోయారు" అంటూ కొడుకు ప్రజ్ఞను చెప్పింది.

"అలాగే నమ్మా! 'కృష్ణ కర్ణామృతం' లోని శ్లోకాలు నిజంగా అమృతపు చినుకుల్లా ఉంటాయి. ఓ రోజు బాలకృష్ణుడు 'అమ్మా' పాలిమ్మ'న్నాట్ట. యశోద 'ఇప్పుడు కాదు, నాయనా' అందిట. 'మరెప్పుడు?' అన్నాట్ట. 'చీకటి పడ్డాక' అందిట. 'చీకటంటే?' అన్నాట్ట. 'అంటే అంతా చీకటైపోయి ఏమీ కనబడకుండా పోతుంది—అప్పుడూ 'అందిట. రెండు కండ్లూ మూసుకుని, 'అమ్మా! ఏమీ కనబడడం లేదు. అంతా చీకటైపోయింది, పాలివ్వు!' అన్నాట్ట." వేణమ్మ, సత్యవతమ్మ గొల్లున నవ్వుకున్నారు. అలా అలా సాగిన సంభాషణ తిరిగి తిరిగి ఇండ్ల కొచ్చింది.

"మీ వారు ఆచార వ్యవహారాల్లో బాగా ఆసక్తి గలవారులా ఉంది. పొద్దున్నే సంధ్యావందనం, ధ్యాన శ్లోకాలూ వినిపిస్తుంటాయి" అన్నారు వేణమ్మగారు.

"వారికి ఆసక్తి బోలెడుంది కాని, ఆచరణ మానివేశారు. నేను కాపరాని కొచ్చిన కొత్త రోజుల్లో ఉభయసంధ్యల్లో సకాలానికి సంధ్యావందనం చేసేవారు. నే నెప్పుడైనా 'సినిమా' అనంటే సంధ్యావందనం మానివేయడ మెలా, రెండవ ఆటకు వెళదామనే వారు. ఇప్పు డాయనే 'ఫస్టు షోకి రెడీగా ఉండు' అని చెప్పి మరీ వెళుతున్నారు. ఇంతమంది పిల్లల్ని సర్దవలసిన వాకు ఆరు గంటల కల్లా తీరిక కావాలంటే దొరకదు. ఆయన విసుక్కుంటారు. 'పోనీ, సంధ్యావందన మన్నా చేద్దురూ!' అని నేను పూర్వ జీవితాన్నిగుర్తుకు తెచ్చి, భోజనాలయాక రెండవ ఆటకు అంటున్నానండీ!" అంది.

"మరి ఉదయం సంధ్యావందనం ..."

"అది మా మరిది అన్నగారు మానే శాక ఆయన ఈయన బదులు కూడా జేస్తున్నారు."

వేణమ్మగారు నవ్వారు.

"అవునండీ! 'అన్నయ్యా సంధ్యా

వందనానికి కూడా నీకు తీరికలేకుండా పోతోందా?' అని లగ దిగితే 'తీరిక కాదోయ్, బ్రదర్, కావలసింది ధ్యాస! అదెక్కడో తాపత్రయంతో కొట్టుకు చస్తుంటే సంధ్యావందనమేం సాగుతుంది? నీవు చేస్తున్నావు గదా — ఆ సంకల్పంలోనే నీ పేరుతోపాటు మా అన్నయ్య కర్తృత్వాన్ని కూడా నేనే స్వీకరించి అనేయ్, సరిపోతుంది అని అంటున్నారు తమ్ముడితో'' అని చెప్పింది సత్యవతి

''మీ మరిది ..''

''అయ నో బ్రహ్మజ్ఞాని! వాళ్ల అన్నయ్య సంధ్యావందనం చేసే రోజుల్లో అయ స్నేదో పాతకాలం నాటి వారి క్రింద జమకట్టే వారు. తీరా పెండ్లీడు వచ్చాక మా వారి స్నేహితుని చెల్లెలో అమ్మాయిని కాస్తా ప్రేమించా న్నాడు. అటు ఆ అన్న గారూ, ఇటు ఈ అన్నగారూ ఎడం కట్టుకొని శాఖాంతర మని అటు వారూ, ఇటు వారూ అంగలార్చినా వినకుండా వివాహం చేశాడు. ఎక్కని జంటే! కాని, ఎటొచ్చి దౌర్భాగ్యమల్లా ఆ అమ్మాయి కుడిచి కూర్చున్నది కూర్చున్నట్లే ఉండి కండ్లు తేలవేసింది. రెండు అవరేషన్లు చేశారు. చిన్న ప్రేవు లెందుకో చిట్లిపోయిందట. కాని, పాపం, పోయింది. అంతే. ఆనాటి నుంచి అతను మారే పోయాడు. శుద్ధ విరాగై పోయాడు. వయ సేముంది గనుక? 'అంతా పాతికేండ్లయినా లేనివాడవు. మరో వివాహం చేసుకొని ఈ దుఃఖాన్ని మరిచిపొమ్మని అన్నగా రెన్ని విధాలో చెప్పి చూశారు. కాని, ప్రయోజనం లేకపోయింది.

ఆ ఆఫీసులో ఉన్న కాసేపూ తప్ప మిగతా అంతా వేదాంతమే అతని కాలక్షేపం.''

నిట్టూర్చింది సత్యవతమ్మ.

''చిన్నప్పటి దగ్గిరినుంచీ మా దగ్గరే ఉండి పెరిగాడు. నేను కాపురాని కొచ్చిన రోజుల్లో ఇంకా అయిదారేండ్ల వాడు. అన్నయ్య దగ్గరే పడుకుంటానని మారాం చేసేవాడు. మా నాలుగోవాడి లాగే వాడూ చాలా మాటకారి. 'నీవు వచ్చావు, మా అన్నయ్య దగ్గర పడుకోనీయడం లేదని మా అత్తగారూ, మామగారూ, అందరి ముందరా నన్ను నిలవేశా డో రోజు.'' నిర్లిప్తంగా సత్యవతమ్మ చెప్పుకుపోతూంది.

''అతన్ని చూస్తే కడుపు తరుక్కుపోతూంది.'' సత్యవతమ్మ గారి కండ్లు చెమర్చాయి. వేణమ్మగారు కండ్ల నొత్తుకున్నారు, ''పెంచిన శ్రద్ధ కదమ్మా!'' అంటూ.

'ఆవుగారికీ, అమ్మగారికీ జై!' అంటూ వచ్చాడు దూడగాడు, ఒక్క దూకులో బడినుంచి. వెనకనుంచి చిన్నమ్మాయొచ్చింది— ''అన్నం పెట్టమ్మా! విన్నా అలస్యమైంది బడికి'' అంటూ.

''మొదలైందండీ మా మధ్యాహ్నపు కార్యక్రమం'' అంటూ లేచింది సత్యవతి

''అమ్మాయీ కాఫీ కొస్తుంది'' అంటూ వేణమ్మ గారూ లేచారు.


* * *

''ధీరసమీరే! యమునాతీరే వసతి వనే వనమాలీ!''

సాక్షాత్తూ చల్లని పిల్లగాడుపులు వీవన వడుతుండగా యమునా తీరంలోని వసతి వనంలో గోపికల మధ్యన కొలువు దీరిన మురళీ మోహనుడు చందన మలదిన నీలమేఘ శరీరంతో దర్శనమిస్తున్నట్లే ఉంది, ఆ పాట వింటుంటే. అంతటి భక్తి తన్మయతలలో లీనమై పాడుతూంది. ఆ విలక్షణమైన గాత్రాన్ని ఎక్కడో విన్నాడు శర్మ. ఎక్కడో ఎంత తడివినా ఆ స్మృతి పాడిస్ఫురించనే లేదు.

పాటను ముగిస్తూ ''వనమాలీ! వనమాలీ! వనమాలీ!'' అని ఆ గాయని ఆ దివ్య మంగళ స్వరూపుని దర్శన భాగ్యం కోసం ఆక్రోశించిందేమో ఆ కంఠం రుద్ధమై పోయింది. శ్రోతలు ఆవూ దూడా, సత్యవతమ్మా, చిన్నమ్మాయీ, దేవుని గదిలో జపానికని కూర్చున్న శర్మలు. శర్మ నేదో అజ్ఞాత శక్తి అప్రతిభుణ్ణి జేసింది. ఆమె కంఠం రుద్ధం కాగానే అతని కండ్లు చెమర్చాయి. పీఠంముందు నుంచి లేచి అప్రయత్నంగానే నడిచి వచ్చాడు. ఆ గాయనికి నమస్కరించాడు, 'ధన్యాత్మ వమ్మా!' అంటూ ఆ రుద్ధ కంఠంతోనే. నీరు గమ్మిన కండ్లు ఎదుట నున్న వ్యక్తిని స్పష్టంగా చూడలేకనే పోయాయి. అంతలోనే అతనిలోని సభ్యతా సభ్యత లన్న రెండు నా శ్లోహో ప్రజ్ఞను వెలార్చాయి. వెనుదిరిగి వెళ్లి పోయాడు.

వేణమ్మగారూ, ఆమె కూతురూ సత్యవతమ్మగారి దగ్గర సెలవు తీసుకొంటుండగా శర్మ అన్నయ్యగా రొచ్చారు.



ఒదిగి ప్రక్కగా తప్పుకున్న వేణమ్మగారిని పరిచయం జేసింది సత్యవతి— 'ఆమె వారి అమ్మాయి. స్కూళ్ళ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నారు. మన పక్క భాగంలోనే ఉంటున్నారు' అంటూ.

వేణమ్మగారికి నమస్కారం చేసి, అటునుంచి నమస్కారం జేస్తున్న అమె కూతుర్ని జూస్తూనే మూర్తి 'మీరు అమలాపురం కాలేజీలో చదివారుగదమ్మా' అన్నారు. అనూరాధ తెల్లబోతూ 'అవునండీ!' అంది బెరుకు బెరుకుగా. "ఎన్నాళ్లకు మళ్లీ మిమ్మల్ని జూచాను!" అని మూర్తి సత్యవతి నుద్దేశిస్తూ, "నీకు తెలుసో లేదోనే, భామా! ఈమె అత్యద్భుతంగా పాడుతుంది. అంబ ప్రసీద కరుణా పరిపూర్ణ దృష్ట్యా అని ఈమె పాడిన ప్రార్థనా శ్లోకం ఇంకా నా కర్ణ పుటాల్లో గింగురుమంటూనే ఉంది. మన శర్మ క్లాస్‌మేట్ కూడా ననుకుంటాను" అని ఏకరువు పెట్టాడు. వేణమ్మగారు "శర్మ ..." అంటూ ఆగిపోయారు. మూర్తి 'వా డింట్లో లేడా' అంటూ తమ్ముణ్ణి కేకవేశాడు. బయటకు వస్తున్న శర్మను— 'వీరిని చూశావ్రటా?' అనడిగాడు. అప్పుడే వేణమ్మగారిని జూచిన శర్మ 'వేణమ్మ గారా? అనూరాధా!' అని విస్తుపోయాడు.

ఇన్నాళ్ళూ ఇంటి ప్రక్కనే ఉండీ పోల్చుకోలేకపోయాం అని నొచ్చుకున్నదంతా, సత్యవతి మినహా.

◆ ◆ ◆

"నాయనా, శర్మా! కార్తీక పూర్ణిమ రేపు. అమరావతికి పోయి కృష్ణా నదిలో స్నానం జేసి అమరేశ్వరుణ్ణి సేవించి వద్దామని ఉంది. మీరూ వస్తే మాకు సాయంగానూ ఉంటారు. దేవుణ్ణి దర్శించుకొన్నట్టూ అవుతుంది." వేణమ్మగారు శర్మను అర్థించిన ట్లడిగారు.

"వస్తార్లే, అమ్మా!" అని భరోసా ఇచ్చింది అనూరాధ. రేపు ఉదయాన బయలుదేరి వెళ్లితే సూర్యోదయాత్పూర్వమే స్నానం చేయడం పడదు. ఈ రాత్రికే వెళ్లితే బాగుంటుం దన్నారు వేణమ్మగారు.

సాయంత్రం బయలుదేరి వెళ్లారు ముగ్గురూ. ఆ రాత్రి అగడానికి ఆ నాటి అమరావతీ మహా పట్టణం గాదు ఈ నాటి అమరావతి. యాత్రిక శాఖ వారు కట్టించిన విశ్రాంతి గృహం ఊరి పొలిమేరల్లో ఊరికి అందకా పొందకా ఎక్కడో కూర్చుండి షికార్లు కొట్టడానికీ, పిక్‌నిక్‌లు చేసుకోవటానిక వచ్చేవారికి మాత్రమే ఉపయోగించేట ట్లున్నాయి గాని, సామాన్యులకు ఉపయోగించేట్లు లేవు. ఉన్న ఒకే ఒక సత్రంలో ఓ చిన్న గది తీసుకొని తమ వెంట ఉన్న సంచుల్నందులో వేసి సూర్యాస్తమయానికి ముందే అమరేశ్వరాలయానికి వెళ్లారు.

కృష్ణా నదీతీరంలోని అమరేశ్వరాలయం వృద్ధ సూర్యభగవానుని చల్లని కిరణాలలో తళతళలాడిపోతూంది. ప్రాచీన వైభోగమంతా ఆ ప్రాకారాల దర్శనమాత్రాననే బోధపడుతుంది. ఈ దేవాలయ నిర్మాణమే విలక్షణమైంది. ఓ మేడ నెక్కి వెళ్లితేనేగాని అసలు ఆలయం కనిపించదు. ఆ అమరలింగేశ్వరుణ్ణి అర్చించాలంటే మరో సోపాన సముదాయా న్నెక్కితేనేగాని అమరలింగని మూర్ధ మందదు. అంత పెద్ద శివలింగ మది. ఆ దేవాలయం మీద నుండి కృష్ణా తీరాన్ని, స్రవంతినీ సందర్శించాలి. ప్రకృతి సౌందర్యమంతా రాశి పోసిన ట్లుంటుంది. పక్కని కళాకారుని కుంచె తన జీవితమంతా ధారపోస్తే, ఆ సౌందర్యంలో లవలేశాన్ని సృష్టించ గలుగుతుందేమో!

ఆ కృష్ణా తీరానికి చేరి ఆ రాతి మీది నుంచి మహా రాతి మీదికి దూకుతూ అప్రపూర్ణ కృష్ణా ఒలాల్లో అక్కడక్కడ ఉన్న గుండశిలలలో ఒక దానిమీదికి చేరి ఆ సూర్యాస్తమయ వేళలోని ప్రకృతి సౌందర్యాన్ని చూస్తూ నిలుచుంది తన్మయురాలై. ఇవతల ఉన్న శర్మ ఆ రంగుల మబ్బు క్రింద, జాలువారుతూ తళతళలాడుతూ మిలమిలలాడే నీళ్ళ మీద రాతి నాధారంగా చేసుకొని నిలుచున్న అనూరాధనూ ఆ ప్రకృతిలో భాగంగా చూస్తూ తానే తన్మయుడై నిలుచున్నాడు. వేణమ్మగారు ఆ దేవాలయాన్ని విడిచి రాలేక అక్కడే ఉండిపోయారు. కార్తీక పున్నమి లాగే ఆ చతుర్దశి భాసిల్లి చంద్రుడు ఓట్టి ఆకాశంపై కొచ్చాడు. తీరం మీద కూర్చున్న శర్మ దగ్గర కొచ్చి అనూరాధ "ఆ చందమామను చూశారా?" అంది. "ఊఁ!" అన్నాడు శర్మ ముక్తసరిగా. "చిన్నప్పటినుంచీ చూస్తున్నదే గదా చందమామ. చూస్తున్నట్లల్లా చూడాలనే అనిపిస్తుంది మోహం మొత్తకుండా.




కారణ మేమిటంటారు?" కవ్వించింది అనూరాధ.

"అది చందమామ అదృష్టం!" అన్నాడు శర్మ.

"ఇదేదో క్రొత్త మలుపండోయ్!" అంది కిలకిల్లాడుతూ అనూరాధ. ఆ నవ్వులోని నిండుదనానికీ, ఆహ్లాదానికీ కృష్ణమ్మ అలరినట్లు వెన్నెల్లో కృష్ణా జలాలు తళతళలాడాయి.

"అవును, అనూరాధా! అందరికీ మామ చందమామ. అందరూ అతణ్ణి ప్రేమిస్తారు. అత డందరికీ ఆహ్లాదాన్నిస్తాడు. అందరిచేతా అభిమానింపబడడం, ఆరాధింపబడడం ఎందరికి సాధ్యపడుతుంది? అందుకనే అది చందమామ అదృష్టమంటాను" అన్నాడు.

"చాలా సీరియస్‌గా చెప్పారే! బాగుంది. మీా రున్నారు. మిమ్మల్ని మీా వాళ్లంతా అభిమానిస్తూనే ఉన్నారు. ఆదరిస్తూనే ఉన్నారు. మీా పరిధిలో మీారూ అదృష్టవంతులే!"

"మన పరిధులకు అవధులున్నాయి, అనూరాధా!"

"చంద్రుని పరిధికీ అవధులున్నాయి, మహాశయా!"

శర్మ ఆలోచనలో పడిపోయాడు.

"అదృష్టంతోముడిపెట్టుకుని మనిషి తన స్వంత ప్రతిభను మరుగున పడిపోనీ రాదండీ! మొగ్గ నొకదాన్ని ఏ పురుగో సగం తినివేస్తే ఆ మొగ్గ పువ్వుగా విప్పు కుంటుంది గాని, 'అయ్యో, న న్నీ పురుగు భ్రష్టం చేసిందే' అని ముడుచుకొని కూర్చోదు చూడండి!"

అనూరాధ ప్రక్కగా కూర్చుని చెప్పుకుపోతుంటే విస్తుపోయి వింటూ చూస్తున్నాడు శర్మ. అనూరాధ ఎప్పుడో కాలేజీలో చదువుకునే రోజుల్లో ఇంత చనువుగా మాట్లాడేది. ఈ మధ్య కాలంలో మళ్లీ ఇప్పుడే అంతలా అలా మాట్లాడుతూంది. ఏదో విషయాన్ని వాదించాలని మనసులో ఉంటే ఎక్కడో అందీ అందని మరో సందర్భంలో మొదలు పెట్టి, దానికీ దీనికీ ముడిపెట్టి తన వాదాన్ని గిరిగీసి నిర్దేశించి గెలుచుకోవడం అనూరాధ ప్రత్యేకత. దేన్ని గురించి ఈ ప్రసంగం మొదలు పెట్టిందో అనూరాధ పోల్చుకోవాలని ప్రయత్నిస్తున్నాడు శర్మ.

"ఇంతకూ అసలు సంగతేమిటో స్పష్టంగా చెప్పరాదూ, అనూరాధా!"

"సంగతేముంది, శర్మగారూ! మీా గురించే."

"నన్ను గురించి ఏముంది, అనూరాధా!"

"ఏమీా లేదంటారు! శర్మగారూ, ఆత్మవంచ నెందుకండీ!"

> ప్రాచీన కాలంలో నృత్యం మత విషయికమైన కళ. కేవలం భగవదారాధనకే నృత్యకళను వినియోగించేవారు. అప్పు డది దేవాలయాలకే పరిమితం ... ఈనాడు నృత్యం మనిషి వినోదానికి ఉపయోగిస్తున్నది మనిషిలో నిద్రిస్తున్న దానవుని లేపడానికే నృత్యం ఉపయోగిస్తున్నది
>
> —బిల్వర్

"ఇందులో ఆత్మ వంచన ఏముంది అనూరాధా?"

"కాకపోతే ఏమిటండీ! మీా రేదో ప్రపంచంలో కష్టమూ, దుఃఖమూ మీా కొక్కరికే సంప్రాప్తమైన ట్లిలా స్థాణువులై పోవడం?"

"... ... ..."

"మీారు మనసారా ప్రేమించి పెండ్లి చేసుకున్న భార్య పోవడం విచారకరమే. విషాదహేతువే. జీవితంలో ఆఘాతమే— కాదనలేము. కాని, మానవుడు పుడుతూనే వెంట తెచ్చుకునే రెండే రెండు మహత్తరమైన ఆస్తులు నిద్రా — పెద్ద నిద్రా. జాతస్య మరణం ధ్రువం అని కదండీ. దీన్ని తప్పించుకోవడం ఎవరి వల్ల అవుతుంది గనుక? కాకపోతే మన మెరగందల్లా ఎవరు ముందు, ఎవరు వెనక? ఎప్పుడు, ఎలా? అన్నది మాత్రమే.

ఆత్మీయులు మనల్ని శాశ్వతంగా వదలపోయినప్పుడు బ్రతుకలే మనుకుంటాం. కాని, బ్రతుకుతాం. బ్రతకటానికే ప్రయత్నిస్తాం. ఎందుకుట? ఇందులోని రహస్య మేమిటట?"

శర్మ తనను తాను నమ్మలేకపోయి నట్లు వింటున్నాడు. అనూరాధ ఎంత పెరిగింది! పరిణతి చెందిన వేదాంతినిలా మాట్లాడుతూంది.

"వినియోగంలో మనిషి క్రుంగిపో కూడదండీ! అగ్నిలో మరిగిన బంగారంలా దీప్తిని పొందాలి. జీవితంలోని ప్రతి అనుభవమూ— అది విషాదకరమే కానీయండి, ఆనందదాయకమే కానీయండి— అనుభవంగా మాత్రమే మిగిలిపోవాలి గాని, అదే జీవితంతో పెనవేసుకొని మనిషిని జడుణ్ణిగా మార్చివేయ రాదండీ!"

"ఇంతకూ నేను జడుణ్ణయిపోయా నంటారు."

"అని నేను అనడం కాదండీ! మీారు స్పష్టంగా మిమ్మల్నిలా మా కందరికీ చూపుతున్నారు. మీాతో పూర్వ ముండే చమత్కారపు సంభాషణ లేదు. మీారు పూర్వం ఎన్నో చక్కని రచనలు చేసేవారు. ఇప్పుడు మీాలో ఆ శక్తి అణగారిపోయిన ట్లయింది గదా. మీా చుట్టూ ఉన్న మీా ఆప్తులందరికీ ఇది ఎంత బాధాకరంగా ఉందో గ్రహించే శక్తి మీాలో నశించింది." అనూరాధ కంఠం రుద్ధమైంది.

"మీా అన్నయ్యగారూ, వదినగారూ మీా గురించి ఎంత బాధపడుతున్నారో మీా రెరగరు." అనూరాధ కండ్ల వెంట అశ్రువులు రాలుతున్నాయి.

"మీారు క్షమిస్తే నేను అయాచితంగా మీా కో సలహా ఇవ్వదలుచుకున్నాను మీారు మళ్లీ పెళ్లి చేసుకోండి!"

"అనూరాధా!"

"క్షమించండి. మీారు అట్టే వయసు కల వారూ కారు. మీాకూ జీవితంలో ఓ భాగస్వామిని అవసరం ఉంది. ఈవేళ మీా అన్నా వదిన లున్నారు గనుక మీాకు బాధ్యతా బరువూ ఏదీ తెలియకుండా ఉంది. జీవితమంతా ఇలా నడవదండీ! తీరా కొంతకాలం గడిచాక చేసుకోవాలన్నా వీల్లేని పరిస్థితి ఏర్పడుతుంది. మీా రిప్పుడైనా పెళ్లి చేసుకుంటే ..."

"అయితే, నే నిప్పుడు పెండ్లి చేసుకోవటమే ధర్మమంటావు."

"ముమ్మాటికీ!"

"అవసరం కూడా నంటావు."

"తప్పకుండా!"

"అయితే, నీ మాట ఏమిటి చెప్పు, అనూరాధా! నీకుమాత్రం వివాహం అవసరం కాదా? నీకూ ఓ అండ కావాలి కదా! నీకు వివాహం కాలేదని మీా అమ్మ కుంగిపోతున్నారు కదా! నాకు చెప్పే నీతిని నీవూ ఆచరించాలి కదా?"

"నేను పెండ్లి చేసుకోనని అనడం లేదండీ, బాబూ! విశాల హృదయంతో నన్ను స్వీకరించగల పురుషపుంగవు డుంటే నేను తప్పకుండా వివాహం చేసుకుంటాను. నా శరీరమే జుగుప్సాకరమూ, హేయ్యమూ అని భావించే వ్యక్తి నాతో సంసార మేం చేస్తాడు? అది మాలో ఎవరిపట్ల సుఖదాయకమౌతుంది? అంతే నండీ నా అభిప్రాయం.

"నేనూ మానవినే గదండీ! నాకూ సహజసిద్ధమైన వాంఛలూ, ఆశలూ ఉంటాయి; ఉన్నాయి. కాని, నాకు కృత్రిమ జీవితం గడుపుతూ కుమలడం ఇష్టం లేదు. నా ఆకృతిని ఎవరైనా సౌందర్యమంటే అది అబద్ధమనీ, అతడు ఆత్మవంచన చేసుకుని నన్ను వంచించడానికి ప్రయత్నిస్తున్నాడనే నర్థం చేసుకోగలను. ఇదీ భగవత్ సృష్టిలో ఓ కళాఖండం అన్నంత విశాల దృష్టితో నన్నెవరైనా అర్ధాంగిగా స్వీకరిస్తే నేనూ వారితో పాటిస్తే, నేను తాపై జీవించాలనే ఆశిస్తాను."

నిరుత్తరుడై, ఆలోచనాపరుడై, నిర్లిప్తుడై చూస్తున్న శర్మను అనూరాధ "నా ఆశ దురాశ అని భావిస్తున్నారు కదూ, శర్మగారూ!" అని డగ్గుత్తికతో ప్రశ్నించింది.

శర్మ కండ్ల వెంట స్రవిస్తున్న అశ్రువుల్ని వారిస్తూ "కాదు, అనూరాధా! నీ మనోసౌందర్యాన్ని, ఆత్మసౌందర్యాన్ని వీక్షిస్తున్నాను. నీ ఆశ నిరాశా, దురాశా కానవసరం లేదు. భగవంతుడు ఏ జీవిపట్లా కఠినుడు కాలేడు. తన సృష్టికి తా నన్యాయం చేయడు; చేయలేడు. నీ వంగీకరిస్తే, నేనే నిన్ను స్వీకరించి ధన్యుణ్ణవుతాను, అనూరాధా!" చివరి మాటలను ప్రయత్నించి పెకలిస్తూనే అన్నాడు.

అమరేశ్వరుని ఆలయంలోని గంటలు గణగణా మ్రోగాయి. కృష్ణానది నీటిలో దేదీప్యమానంగా తన ప్రతికృతిని ప్రతిఫలించుకుని కృష్ణలో ఇమిడిపోయిన అమరేశ్వరుని ఆలయాన్ని చూస్తూ శర్మ మాటలను వింటున్న అనూరాధ చివరి మాటలను విని తనను తానే నమ్మలేనంత ఉద్వేగంతో ద్రవించిపోయింది. పరమ విరాగి శంకరుడు పార్వతీదేవిని కటాక్షించి నప్పుడు పార్వతీదేవి పొందిన అనుభూతి ఆమెలో పెల్లుబికి ప్రవాహమై కృష్ణానదితో పోటీ పడిపోయింది. ఆ వెల్లువలో శర్మ కృష్ణానదిలో ప్రతిఫలిస్తున్న అమరేశ్వరాలయానికన్నా స్పష్టంగా, దేదీప్యమానంగా వెలిగాడు.

అనూరాధ తనను తాను తెలుసుకొని కండ్లు తెరిచేసరికి శర్మ హృదయాన్ని తన తల ఆధారంగా చేసుకొని విశ్రమిస్తున్నట్లూ, శర్మ మృదువుగా తనను పొదివి పట్టుకొని ఆ మూర్ధాన్ని తన చెంపకు జేర్చి సమాదరిస్తున్నట్లూ గ్రహించింది. ఆధారా న్నల్లుకున్న లతలా అనూరాధ ఆధారాన్నలాగే ఆశ్రయించి కనులు విప్పి ప్రకృతికి ప్రతికృతై ప్రతిఫలిస్తూ దర్శన మిస్తున్న ఆ అమరేశ్వరాలయాన్ని చూస్తూ, ఆ ఆలయంలోని ఆదిదంపతుల్ని—

"నమశ్శివాభ్యాం నవయౌవనాభ్యాం
పరస్పరాశ్లేష వపుర్ధరాభ్యాం
నగేంద్ర కన్యా వృషవాహనాభ్యాం
నమో నమ శ్శంకర పార్వతీభ్యాం"

అంటూ ఆత్మలో సందర్శిస్తూ ఆత్మ నమస్కారా న్నర్పించింది అనూరాధ ★